


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 56 | ఆదివారం 23 - 3 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 56 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 23 SUNDAY MARCH 2025 PAGES : 8 Rs :2-00

## ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. మరో వారంరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో రివ్యూ చేశారు. కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి...సకాలంలో నిధులు విడు దల అయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా..... కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని తెలిపారు. హైదరాబాద్ లోని సిఎం నివాసంలో జరిగిన ఈ రివ్యూకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక .....శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ లో ఫరూక్ నివాసానికి చంద్రబాబు వెళ్లారు. మంత్రి ఫరూక్ సతీమణి షెహనాజ్ మృతి పట్ల సంతాపం తెలుపారు. మనో ధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులతో చంద్రబాబు పేర్కొన్నారు. దాదాపు గంట సమయం పాటు మంత్రి కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, సీపీఐ నేత రామకృష్ణ, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గిత్త జయసూర్య, పరిటాల సునీత, టిడిపి నాయకులు భార్గవ్ రామ్, తుగ్గలి నాగేంద్ర, తిక్కారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి,పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మార్కుఫెడ్ మాజీ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్,వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి ఫరూక్ ను పరామర్శించారు.

## చంద్రబాబే నాకు స్ఫూర్తి: పవన్ కల్యాణ్

- చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమన్న పవన్
- ఆయన 15 ఏళ్లు సీఎంగా ఉండాలన్న డిప్యూటీ సీఎం
- రాయలసీమ రతనాలసీమ కావాలని ఆకాంక్ష



అమరావతి: ఏపీ కష్టాల్లో ఉన్న సమయంలో కూటమిని రాష్ట్ర ప్రజలు గెలిపించారని... మొత్తం 175 సీట్లలో 164 సీట్లను కట్టబెట్టి ఘన విజయం అందించారని చెప్పారు. కూటమికి 21 ఎంపీ స్థానాలను కట్టబెట్టారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నామని చెప్పారు. రాష్ట్రం బాగుండాలని చంద్రబాబు కోరుకుంటారని... చంద్రబాబే తనకు స్ఫూర్తి అని... ఆయన స్ఫూర్తితోనే తాను పని చేస్తున్నానని తెలిపారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమని... ఆయన 15 ఏళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు రాజన్న పొలంలో ఫామ్ పాండ్ నిర్మాణ పనులకు పవన్ భూమిపూజ చేశారు. అనంతరం పూడిచెర్లలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పల్లె పండుగ విజయవంతం కావడానికి చంద్రబాబే కారణమని పవన్ కితాబునిచ్చారు. రాయలసీమలో నీటి కష్టాలు ఎక్కువగా ఉండేవని చెప్పారు. భారీ వర్షాలు పడితే నీటి నిల్వ సౌకర్యం రాయలసీమలో లేదని అన్నారు. మే నెలలోపు లక్ష 55 వేల నీటి కుంటలు పూర్తి కావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని... వర్షాల సమయంలో ఈ కుంటలన్నీ నిండితే ఒక టీఎంసీ నీళ్లు అందుబాటులో ఉంటా యని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయలు చెప్పినట్టు రాయలసీమ రతనాలసీమ కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రం బాగుండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని... ఆయనను ప్రేరణగా తీసుకుని తనకు అప్పగించిన శాఖలన్నిం టినీ బలోపేతం చేస్తున్నానని చెప్పారు. ఒకేరోజు 13,326 గ్రామ సభలు నిర్వహి ంచి అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల జాబితా .......ను రూపొంది ంచి ప్రపంచ రికార్డు సాధించామని అన్నారు. రాష్ట్రంలో 52.92 లక్షల కుటుంబాల్లో 97.44 లక్షల మంది ఉపాధి కూలీలకు స్వగ్రామాల్లో ఉపాధి కల్పించామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 4 వేల పైచిలుకు రోడ్లు మాత్రమే నిర్మించారని... ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే దాదాపు 4 వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగిందని పవన్ వెల్లడించారు. 100 మందికి పైగా జనాభా ఉన్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్,తాగునీటితో పాటు మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

## ఏపీకి కొత్త డీజీపీ ఎవరు ?

### యూపీఎస్సీకి ఐదు పేర్లు పంపిన ప్రభుత్వం..!



అమరావతి: ఏపీలో ఇన్ ఛార్జ్ డీజీపీగా ఉన్న హరీష్ కుమార్ గుప్తా స్థానంలో కొత్త డీజీపీ ఎంపిక కోసం కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇవాళ ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను యూపీఎస్సీకి పంపింది. ఇందులో మూడు పేర్లను ఎంపిక చేసి తిరిగి యూపీఎస్సీ ప్రభుత్వానికి పంపుతుంది. ఇందులో నుంచి ఒక అధికారిని ప్రభుత్వం డీజీపీగా నియమించే అవకాశం ఉంది. దీంతో కొత్త డీజీపీ ఎవరన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.గతంలో డీజీపీగా పనిచేసిన ద్వారకా తిరుమల రావు రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం కొత్త డీజీపీ ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం యూపీఎస్సీకి పేర్లు పంపడానికి సమయం లేకపోవడంతో ప్రభుత్వం తాత్కాలిక డీజీపీగా హరీష్ గుప్తాను నియమించింది. గతంలో ఎన్నికల సమయంలోనూ హరీష్ గుప్తాను ఈసీ ఓసారి డీజీపీగా నియమించింది. దీంతో హరీష్ గుప్తాను ఎంపిక చేసిన ప్రభుత్వం.. ఆయనతో పాటు మొత్తం ఐదు పేర్లను యూపీఎస్సీకి పంపింది.రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీ ఎంపిక కోసం యూపీఎస్సీకి పంపిన పేర్లలో సీనియర్ ఐపిఎస్ లు మాదిరెడ్డి ప్రతాప్, రాజేంద్ర నాథ్ రెడ్డి, హరీష్ కుమార్ గుప్తా, కుమార్ విశ్వజిత్. సుబ్రహ్మణ్యం ఉన్నారు.వీరిలో ముగ్గురిని కేంద్రం ఎంపిక చేసి తిరిగి పంపనుంది. అప్పుడు వారిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా ఎంచుకునే అవకాశాలున్నాయి. అప్పుడు ఆయన్ను కొత్త డీజీపీగా నియమించనున్నారు. ఎలాగో కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వమే ఉండటంతో ప్రభుత్వ ఛాయిస్ మేరకే డీజీపీ ఎంపిక ఉండొచ్చని తెలుస్తోంది.

## ప్రధాని మోదీకి జగన్ లేఖ



అమరావతి : డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన నెలకొన్న సంగతి తెలిసిందే. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్ సభ స్థానాలు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ కారణంగా పార్లమెంట్ లో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం కచ్చితంగా తగ్గుతుందని... అందుకే జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ లేకుండా చూడాలని కోరుతున్నామని లేఖలో జగన్ పేర్కొన్నారు. పార్లమెంట్ లో తీసుకునే నిర్ణయాల్లో అన్ని రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా ఉండాలని జగన్ చెప్పారు. అందుకే దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గకుండా చూడాలని కోరారు. ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం తగ్గకుండా డీలిమిటేషన్ కసరత్తు జరగాలని కేంద్రాన్ని కోరుతున్నానని చెప్పారు. మరోవైపు డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జగన్ ఆదేశాల మేరకు ఈ లేఖ సారాంశాన్ని డీఎంకేకు వైవీ సుబ్బారెడ్డి పంపించారు.

## గుంటూరు జైలు నుండి విడుదలైన పోసాని కృష్ణమురళి



అమరావతి : ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళి గుంటూరు జిల్లా కారాగారం నుండి విడుదలయ్యారు. పోసానికి నిన్న కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రెండు వారాలకు ఒకసారి సీఐడీ కార్యాలయంలో సంతకం చేయాలని ఆదేశించింది. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానికి వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్వాగతం పలికారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన కారులో ఇంటికి వెళ్లారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో గత నెలలో పోసాని అరెస్టయ్యారు. సీఐడీ కోర్టు పోసానికి నిన్న బెయిల్ మంజూరు చేసినప్పటికీ, షూరిటీ సమర్పణలో జాప్యం కావడంతో విడుదల ప్రక్రియ ఆలస్యమైంది. అన్ని ఫార్మాలిటీలు పూర్తి కావడంతో నేడు సాయంత్రం విడుదలయ్యారు.

## గవర్నర్ ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



అమరావతి : 78వ గణతంత్ర దినోత్సవ వేడుక లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పదిమంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ యూనివర్సిటీ నుంచి న్యూఢిల్లీలో 40 రోజులు పాటు పెరేడ్ చేసి 78వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రగౌరవ గవర్నర్ ని మర్యాద పూర్వకంగా కలిసారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫ్రీ రిపబ్లిక్ పెరేడ్ కంటిన్జెంట్ లీడర్ మరియు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డి నేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు మాట్లాడుతూ మన రాష్ట్ర గవర్నర్ కి కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌరవనీ యులు సయ్యద్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మీరందరూ రేపటి భావిభారత పౌరులుగా దేశానికి సేవలందించాలని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని రాష్ట్ర ప్రతిష్ట కోసం కృషి చేసిన మీ అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలిపారు.

## ఏపీలో విద్యార్థులకు నారా లోకేష్ అదిరిపోయే న్యూస్..! శనివారం పండగే..!

అమరావతి: ఏపీలో విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇవాళ మరో శుభవార్త చెప్పారు. ఇప్పటికే స్కూళ్లలో పలు విద్య సంస్కరణలు చేపడుతున్న లోకేష్.. ఇవాళ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా పుస్తకాల మోతతో సతమతం అవుతున్న విద్యార్థులకు తాత్కాలికంగా ఊరటనిచ్చేలా ఈ నిర్ణయం ఉంది. దీంతో విద్యార్థులకు ప్రతీ వారం ఒక రోజు ఈ మోత నుంచి విముక్తి కలగబోతోంది.ఏపీలో ఇకపై ప్రతీ శనివారం నో బ్యాగ్ డేను అమలు చేయాలని నిర్ణయించినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ప్రస్తుతం ప్రతీ నెలా మూడో శనివారం నో బ్యాగ్ డేగా అమలు చేస్తున్నారు. అయితే దీన్ని ప్రతీ శనివారానికి వర్తింపచేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నిర్ణయం వెంటనే కాకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయబోతున్నట్లు నారా లోకేష్ తెలిపారు. అయితే ఇలా శనివారం నో బ్యాగ్ డే రోజు ఏయే కార్యక్రమాలు ఉంటాయో కూడా లోకేష్ వెల్లడించారు. శనివారం రోజు ప్రతీ పాఠశాలలోనూ విద్యార్థులకు క్విజ్ లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు విద్యామంత్రి లోకేష్ తెలిపారు. దీంతో విద్యార్థుల్లో సృజనాత్మకత కూడా అభివృద్ధి చెందే అవకాశముంది. లోకేష్ నిర్ణయంపై విద్యార్థులతో పాటు తల్లితండ్రుల్లోనూ హర్షం వ్యక్తమవు తోంది. గతంలో ఉన్న నెలకో శనివారం స్థానంలో ఇలా ప్రతీ శనివారం నో బ్యాగ్ డే అమలు చేయడం మంచిదేనన్న అభిప్రాయం విద్యావేత్తల్లోనూ వ్యక్తమవుతోంది.

# వ్యవసాయం, మత్స్య సంపద ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం వృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి



**రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి22**: వ్యవసాయం, మత్స్య సంపద ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం వృద్ధి అయ్యే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు 10.70 శాతం లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందులు లేని సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 28,184 హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం సాగు చేశామన్నారు. ఏడు శాతం ఉత్పత్తి పెరుగుదల అయ్యేలా 30,998 హెక్టార్లకు సేంద్రియ వ్యవసాయం సాగు లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. తద్వారా జిల్లాకు రూ.4,943 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మత్స్య సంపద, ఆక్వా సాగు ద్వారా ఏడాదిలో రూ.12,440 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఏడాదిలో 13.41 వృద్ధిరేటు సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధిపై రూపొందించే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అతి తక్కువ నిధులతో ఆరు బీచ్ లను అభివృద్ధి చేయడం ద్వారా ఏడాదికి రూ.535 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పర్యాటకంపై 18.88 వృద్ధిరేటు ఉంటుందన్నారు. అటవీ సంపద వృద్ధి చేయాలని ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఉద్యాన పంటలు అదనంగా 1,650 హెక్టార్లకు విస్తరింప చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. విస్తీర్ణం పెరుగుదలతో ఉత్పత్తులు అధికం అవుతాయని తద్వారా రూ.4,065 కోట్ల ఆదాయం జిల్లాకు వస్తుందన్నారు. 11.49 శాతం వృద్ధిరేటు సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. మూడువేల హెక్టార్లలో సూక్ష్మ, బిందు సేద్యం సాగయేలా రైతులను చైతన్య పరచాలన్నారు. రానున్న ఏడాదిలో 20% వృద్ధిరేటు సాధన దిశగా అధికారులు అడుగులు వేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా సంప్రదాయ పద్ధతిలో 54,654 గేదెలు, ఆవులు ఉత్పత్తి చేయాలని లక్ష్యం కాగా, కృత్రిమ పద్ధతిలో 49,675 గేదెలను ఉత్పత్తి చేయాలన్నారు. దీంతో పాల దిగుబడి మరింత పెరిగి ఆదాయం రూ.6,630 కోట్లకు చేరే లక్ష్యంతో 15.20 శాతం వృద్ధిరేటుగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రానైట్, ఇసుక, కంకర వనరులతో రూ.110 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. అలాగే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణతో వార్షికాదాయం రూ.1,941 కోట్లకు పెరిగేలా లక్ష్యాలు రూపొందించాలన్నారు. తద్వారా 37.51% వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రైల్వే లైన్ ద్వారా రూ.109 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తాజాగా రైల్వే గూడ్స్ రేకో వంటి తదితర వనరులతో ఏడాదిలో వృద్ధిరేటు 5.83% పెరగనందన్నారు. గ్రామీణ నీటి సరఫరా మరింత పెంచడానికి రూ.167 కోట్లు పనులు చేయాలని ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజనం కొరకు పైప్ లైన్ల నిర్మాణం పెంచాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.731 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రచించాలన్నారు. ప్రస్తుతం రూ.17.91 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణాలు లక్ష్యంగా పనులు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ప్రపంచ నీటి దినోత్సవం



రాయల్ జర్నలిజం ( కాకుమాను) ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా కాకుమాను మండలం కొండబాలవరి పాలెం గ్రామ పంచాయతీ లోని రైతు గేరా శివ నాగేశ్వరరావు పొలమునందు శనివారం ఫామ్ పాండ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రైతులు సుమారుగా 30 మంది పాల్గొన్నారు, కార్యక్రమంలో ఎంపీడీఓ కె యుగ కీర్తి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతుకు ఫామ్ పాండ్ వల్ల ఉపయోగాలు వివరించి ప్రతి రైతు వారి పొలంలో ఫామ్ పాండ్ ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామ సర్పంచి పెద్ది లక్ష్మి, ఏపీవో కె సింగారావు,గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ది రవీంద్ర బాబు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి జిల్లాకు రాక

## కలిసిన జిల్లా కలెక్టర్, ఎస్.పి







**విజయనగరం,(రాయల్ జర్నలిజం):** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి శనివారం జిల్లా పర్యటనకు నగరానికి చేరుకున్నారు. జిల్లా కోర్టులో జరిగిన న్యాయాధికారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జిల్లా ఎస్.పి. వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి సాయికల్యాణ్ చక్రవర్తి కూడా వున్నారు.

# రూ.9.72 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

## లబ్ధిదారులకు పంపిణీ చేసిన - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం,(రాయల్ జర్నలిజం)**
అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం గంట్యాడలో అందజేసారు.

**లబ్ధిదారుల వివరాలు చూస్తే..**

1) గజపతినగరం మండలం, భూదేవిపేట గ్రామానికి చెందిన కట్టమూరి జగన్నాథంకు రూ. 98,079

2) దత్తిరాజేరు మండలం, గడసాం గ్రామానికి చెందిన వోల్లు నారాయణప్పడుకి రూ. 15,000

3) దత్తిరాజేరు మండలం, ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన అరిశెట్టి రామచంద్రరావుకు రూ. 2,91,200

4) దత్తిరాజేరు మండలం, పెదమానాపురం గ్రామానికి చెందిన బల్లిరెడ్డి ఉమామహేశ్వరరావుకు రూ. 40,000

5) గంట్యాడ మండలం, బురదపాడు గ్రామానికి చెందిన కోరుపోలు హర్షవర్ధన్ కు రూ. 2,94,238

6) దత్తిరాజేరు మండలం, చౌదంటివలస గ్రామానికి చెందిన కె. జగదీశ్ కు రూ. 43,400

7) జామి మండలం, లొట్లపల్లి గ్రామానికి చెందిన వెల్దాటి దేముడమ్మకు రూ. 67,678/-

8) జామి మండలం, కె. తాండ్రంగి గ్రామానికి చెందిన గుల్లిపల్లి గౌరమ్మ కి రూ. 1,22,379 ఈ సందర్భంగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, అనారోగ్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతూ సహాయం కోసం ఎదురుచూస్తున్న అనేకమందికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా మారిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాక్షల మేరకు ప్రభుత్వం నుంచి విడుదలైన ఈ సహాయాన్ని వినియోగించుకొని మెరుగైన వైద్యాన్ని పొంది ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ రోజు తన చేతుల మీదుగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ని సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేసి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారికి తమ తరపున అభినందనలు తెలియజేశారు.

# శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరకు నూతన ఉత్సవ కమిటీ ఏర్పాటు

రాయల్ జర్నలిజం (కాకుమాను) ఏప్రిల్ 22వ తేదీన జరుగు కొండపాటూరు గ్రామం శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరగనున్న నేపథ్యంలో కమిషనర్, దేవాలయ శాఖ విజయవాడ వారిచే నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో సురేష్ బాబు శనివారం తెలిపారు. ఈ కమిటీ ద్వారా తిరునాళ్ళ మహోత్సవ విజయోత్సవానికి అందరి కృషి అవసరమని సభ్యులతో మాట్లాడారు. 11 మంది సభ్యులతో "ఫెస్టివల్ కమిటీ"ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వటం జరిగింది.

# రూ.300 సగటు వేతనం రావాలి

**వేతనదారులు రెండు పూటలూ పనిచేయాలి : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్**

**కెరటాంలో పంటకుంటల పనులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**స్వయంగా గునపం చేతపట్టి పనులు ప్రారంభించిన కలెక్టర్**

**ప్రతి మండలంలో మోడల్ ఫారంపాండ్లు నిర్మించాలి**



**విజయనగరం,(రాయల్ జర్నలిజం)**
జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే ప్రతి వేతనదారుకు కనీసం రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. వేతనదారులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో కనీసం ఆరు గంటలపాటు పనుల్లో పాల్గొనడం ద్వారా వారికి రోజుకు రూ.300 కనీస వేతనం లభించేలా చూడొచ్చన్నారు. ఉపాధి వేతన దారులు ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6.30 వరకు పనుల్లో పాల్గొనడం ద్వారా రోజుకు రూ.300 వేతనాన్ని పొందవచ్చని చెప్పారు.వరల్డ్ వాటర్ డే సందర్భంగా జల సంరక్షణలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ భూముల్లో చేపట్టిన ఫారంపాండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ శనివారం బొండపల్లి మండలం కెరటాంలో ప్రారంభించారు.కెరటాంలో చింతపల్లి సూర్యనారాయణ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల మామిడితోటలో పంటకుంటలు(ఫారంపాండ్) తవ్వే పనులను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. మహిళా వేతనదారులతో, భూమి యజమానులతో భూమిపూజ చేయించిన అనంతరం కలెక్టర్ గునపం చేతబూని మట్టి తవ్వి పంటకుంటలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడిన కలెక్టర్ రోజుకు వారు ఎన్ని గంటలు పనిలో పాల్గొంటున్నారు. ఎంత సగటు వేతనం వస్తోందనే అంశాలను తెలుసుకున్నారు. తమకు సగటున రూ.250 వరకు వేతనం అందుతోందని వేతనదారులు వివరించారు. పంటకుంట తవ్వేందుకు ఎంత మొత్తంలో ఉపాధినిధులు ఖర్చు చేస్తున్నదీ కలెక్టర్ తెలుసుకున్నారు. రూ.23 వేలతో ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఏపిఓ కృష్ణవేణి వివరించారు. ఆపై అదే గ్రామంలో గణరాజు లక్ష్మణరావుకు చెందిన కొబ్బరితోటలో తవ్విన పంటకుంటను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ వేతనదారులతో, భూయజమానితో మాట్లాడారు. ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు రూ.60,979 మంజూరు చేయడం జరిగిందని, గత ఆరురోజులుగా ఇక్కడ పనిచేస్తున్నట్టు వేతనదారులు చెప్పారు. ఈ ఏడాది ఎన్ని రోజులు పనిచేశారని మహిళా వేతనదారులను కలెక్టర్ ప్రశ్నించారు. సుమారు 60 నుంచి 70 రోజులు పనిచేశామని వారు కలెక్టర్‌కు చెప్పారు. జిల్లాలో ప్రతి మండలంలోనూ కొన్ని పంటకుంటలను శాస్త్రీయ పద్ధతిలో పూర్తి స్థాయిలో జలసంరక్షణ జరిగేలా రూపొందించాలని డ్వామా పి.డి. శారదాదేవిని కలెక్టర్ ఆదేశించారు. ఈనెలలో 3215 పంటకుంటలను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డ్వామా పి.డి. వివరించారు. జిల్లాలో శనివారం నాడు 731 పంటకుంటల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి




**తాడేపల్లిగూడెం(రాయల్ జర్నలిజం)** కాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు ప్రముఖ వైద్య నిపుణులు (ఏలూరు) డాక్టర్ బి.సింధు. ఏపీ "నిట్" లోని మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ సింధు



మాట్లాడుతూ.. క్యాన్సర్ లో ఎన్నో రకాలున్నాయన్నారు. వాటిలో మహిళలను అంతులేని భయానికి గురి చేస్తుంది బ్రెస్ట్ క్యాన్సర్ అని చెప్పారు. ఈ బ్రెస్ట్ క్యాన్సర్ మహిళలకే కాకుండా మగ వారికి కూడా వస్తుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే ఈ క్యాన్సర్ మహమ్మారిని మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఏపీ నిట్ వైద్యాధికారి డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ క్యాన్సర్ రకాలు, క్యాన్సర్ రావడానికి గల కారణాలు, వాటి లక్షణాలు, ఆధునిక చికిత్సా విధానాల గురించి వివరించారు. మహిళల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సింధును ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమ బిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNLISAM

# పారిశ్రామికాభివృద్ధి, యుతకు ఉద్యోగ అవకాశాలు ప్రాధాన్యత..



**వచ్చే మార్చి లోగా 7వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రతినెలా జాబ్ మేళాలు నిర్వహించాలి..**
**దేశంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసే 50 పర్యాటక ప్రదేశాలలో కొల్లేరు, పోలవరం ప్రాజెక్ట్ లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..**
**ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు జానంపేట వద్ద పోలవరం ప్రాజెక్ట్ కుడిప్రధాన కాల్వ నుండి గోదావరి జలాలను పైప్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాధించాలి..**
**జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశంలో అధికారులకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశం..**

ఏలూరు :.ఏలూరు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధిపథంలో నిల్పి, అర్హత కలిగిన ప్రతీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రాధాన్యతగా చేపట్టాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటాపద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాను వ్యవసాయంతోపాటు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి దిశగా పయనింపజేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన భూమికి అవసరమైన ల్యాండ్ బ్యాంకు వివరాలు అధికారులు సేకరించారన్నారు. ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం వంటి విషయాలతో పాటు స్కిల్ సెన్సస్ నిర్వహించి ఏ కుటుంబంలో ఉపాధి అవసరమైన వ్యక్తులు, వారి అర్హతలను తెలుసుకోవడం, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం, జాబ్ మేళాలు నిర్వహించి, ఎక్కువమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2026, మార్చి లోగా జిల్లాలోని 7వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రతీ నెల జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పరిశ్రమలకు దరఖాస్తు చేసుకునేవారికి సింగిల్ విండో విధానం ద్వారా నిర్దేశించిన సమయంలోగా అనుమట్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలు 3 వేళా కోట్లరూపాయలు పైగా టర్న్ ఓవర్ కలిగి ఉన్నాయని, వాటి నుండి కార్పొరేట్ సామజిక బాధ్యత నిధులు కింద 2 శాతం వరకు సదరు పరిశ్రమలు చెల్లించవలసి ఉందన్నారు. వీటితో రైతులకు అవసరమైన వివిధ పనులతోపాటు, గ్రామాలలో ప్రజలకు అవసరమైన ఎన్నో పనులు చేపట్టవచ్చని, ఈ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, ఇందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించి



పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో జిల్లాలో ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు విజయవాడ కృష్ణా కాల్వ నుండి మురుగునీరు త్రాగునీరుగా సరఫరా అవుతుందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా విజ్జేశ్వరం నుండి గోదావరి జలాలు అందించేందుకు పైప్ లైన్ ఏర్పాటుకు డిపిఆర్ ప్రతిపాదనలు తయారుచేశారని, దీనిస్థానంలో దెందులూరు నియోజకవర్గంలోని పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాల్వ నుండి పైప్ లైన్ ఏర్పాటుచేసి, స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని దెందులూరు శాసనసభ్యులు విజ్ఞప్తిపై ఎంపీ స్పందిస్తూ ఈ విషయంపై వెంటనే పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాల్వ నుండి జానంపేట నుండి పైప్ లైన్ ఏర్పాటుచేసి గోదావరి జలాలు అందించేలా డిపిఆర్ తో ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీ ఆదేశించారు. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తెలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఎంపీ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2. 58 లక్షల కుటుంబాలకు పనిదినాలు కల్పించారని, 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద 206 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు వంటి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం జిల్లాలో 9 వేల ఎకరాలలో ఉద్యాన పంటలు సాగుయేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సభ్యులతో ఏలూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) ని నియమించి, తరువాత సమావేశంలో పూర్తి స్థాయి సభ్యులతో సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. 109 కోట్ల రూపాయలతో ప్రతిపాదించిన ఉంగుటూరు-కైకలూరు రోడ్డు నిర్మాణం పనులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, టి. నర్సాపురం-చింతలపూడి, టి..నర్సాపురం- జంగారెడ్డిగూడెం రోడ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండలాలలో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలను స్థానిక ఎమ్మెల్యే లకు తెలియజేసి, వారి సూచనలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. దేశంలో 50 ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెంసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, వీటిలో మన జిల్లాలోని కొల్లేరు, పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్ధేందుకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి పరుగులు తీసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేసారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది, పొలం బడి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా నిర్వహించాలన్నారు. భీమడోలు మండలం మల్లవరం, చెట్టున్నపాడు గ్రామాలలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరాగా, ఈనెల 25వ తేదీ మంగళవారం నుండి ఆగడాలలంక ఛానల్ నుండి త్రాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జున తెలియజేసాశారు.జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా ఇప్పటికే 1830 కోట్ల రూపాయల విలువైన 4302 ఎకరాల ప్రభుత్వ భూమిని ల్యాండ్ బ్యాంకు ద్వారా గుర్తించామన్నారు. పారిశ్రామిక జోనల్ ప్లాన్ ను రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఏప్రిల్ 10 వ తేదీన జాబ్ మేళా నిర్వహించి వెయ్యిమందికి ఉపాధి కల్పించే దిశగా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ హబ్ ల ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి, ప్రతీ నెలా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాని, సీడాప్ ద్వారా ఇప్పటికే 826 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. సిఎస్ఆర్ ఫండ్స్ సేకరణకు పారిశ్రామిక, బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం జిఎస్ డబ్ల్యూఎస్ నుంచి ఒక అధికారిని నోడల్ అధికారిగా నియమిస్టమన్నారు దెందు లూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుండి రక్షిత త్రాగునీటి పథకాలలో ఫిల్టర్ బెడ్స్ మార్పుచేయాలన్నారు. త్రాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ లు మరమత్తులు కారణంగా ట్యాంకులను శుభ్రం చేయడంలేదని, ఓవర్ హెడ్ ట్యాంకులను మెట్ల వంటి వాటికి మరమ్మత్తులు చేపట్టి, ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. 2019 కి ముందు తమ ప్రభుత్వ హయాంలో గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను చేపట్టామని, కానీ వాటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయన్నారు. వాటిని పూర్తి చేయాలనీ విజ్ఞప్తి చేశారు. విజ్జేశ్వరం నుంచి గోదావరి నీరు పైప్ లైన్ల ద్వారా సరఫరా చేయాలన్న ప్రతిపాధనలకు ప్రత్యమ్నాయంగా ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు జానంపేట వద్ద పోలవరం ప్రాజెక్ట్ కుడిప్రధాన కాల్వ నుండి గోదావరి జలాలను పైప్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాధించాలని సూచించారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలనీ కోరారు. చింతలపూడి నియోజకవర్గంలో పరిశ్రమలను మంజూరు చేసి నియోజక అభివృద్ధి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ కె. భీమేశ్వరరావు, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు,ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు నాగార్జునరావు, త్రినాధ్ బాబు, వ్యవసాశాఖాధికారి హబీబ్ భాష, ఉద్యానవన శాఖ డిడి రామ్మోహన్, డిఎంహెచ్ ఓ డా. మాలిని, డిఈఓ వెంకటలక్ష్మమ్మ, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, ప్రభృతులు పాల్గొన్నారు.

# బాయ్స్ హాస్టల్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన వీసీ

కాకినాడ మార్చి , 22 : ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని మెన్ హాస్టల్ ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్. రాహుల్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయంలో విసి ఆచార్య ప్రసన్నశ్రీ ని కలిసిన కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్ రాహుల్ తో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తరువాత బాయ్స్ హాస్టల్ లోని వంట గదిని, విద్యార్థులు భోజనం చేసే మెస్ హాల్ ను పరిశీలించారు. వీసీ విద్యార్థులతో మాట్లాడి హాస్టల్ నిర్వహణ, మెస్ నాణ్యతపై ఆరా తీశారు. హాస్టల్ నిర్వహణ సిబ్బంది అందరూ నిబద్ధతగా పని చేయాలని, పరిశుభ్రంగా హాస్టల్ ను నిర్వహించాలని అన్నారు.




పరిశుభ్రత విషయంలో సిబ్బంది, విద్యార్థులు వ్యక్తిగత బాధ్యత వ్యవహరించాలన్నారు. హాస్టల్ మెస్ ను మరింత నాణ్యతగా ఏ విధంగా నిర్వహించవచ్చు అనే సూచనలను రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి రాహుల్ తెలియజేశారు. కేంద్ర కారాగారంలో తాము తీసుకున్న కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను సూచించారు. హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, మంచిగా చదువుకొని ఉన్నతంగా జీవించాలని తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.కె.శ్రీరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పలువురు కుటుంబాల్ని పరామర్శించిన "పిల్లి" దంపతులు



..కరప: )మార్చి , 22 :పితృవియోగంతో బాధపడుతున్న గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన పాత్రికేయులు రమేష్ కుటుంబాన్ని శనివారం కాకినాడ రూరల్



నియోజకవర్గం కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి,మాజీ శాసనసభ్యురాలు అనంతలక్ష్మి పరామర్శించారు.అనంతరం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మరణించిన గురజనాపల్లి (అడింపూడి) గ్రామానికి చెందిన కోటా శ్రీరామ్, పాతర్లగడ్డ గ్రామానికి చెందిన గుత్తుల సత్యనారాయణ, కొంగోడు గ్రామానికి చెందిన జంపన సత్యనారాయణ రాజు, %ూ%.అచ్యుతాపురం గ్రామానికి చెందిన నేరేడుమిల్లి నగధర్ కుటుంబాల్ని పిల్లి దంపతులు పరామర్శించి సానుభూతి తెలిపారు.పరామర్శించిన వారిలో కరప మాజీ జెడ్పిటిసి బుంగ సింహాద్రి, పంపన కన్నారావు, ఆట్ల గోవిందు, పబ్బినీడి నాగేశ్వరరావు, కోటా శ్రీను, కోనాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పెమ్మసాని తో చర్చించిన పౌర సంస్థలు



గుంటూరు: గుంటూరు నగర అభివృద్ధికి శంకర్ విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం ఎంతగానో తోడ్పడుతుందని గుంటూరు నగర ప్రజలకు ఉపయోగపడే విధంగా ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం జరగాలని కోరుతూ ఈనెల 22వ తేదీ శనివారం కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రావుని గుంటూరు నగరంలోని పౌర సంస్థల ప్రతినిధులు గుంటూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎల్చూరి వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు పి. మల్లికార్జునరావు, ప్రముఖ విద్యావేత్త మాస్టర్ మైండ్స్ వ్యవస్థాపకులు ఎం.ఎస్.ఎన్. మోహన్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి ప్రముఖ ఆర్కిటెక్ట ఇంజనీర్ కుటుంబరావు లతో కలిసి శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నూతన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు పై చర్చించారు. శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ తోపాటు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరండల్ పేట, బ్రాడీపేట 4వ లైన్ బ్రిడ్జి కింద 60 అడుగుల రహదారి మరియు బ్రాడీపేట అరండల్ పేట 5వ లైన్ ల వద్ద 45 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మిస్తామని కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రావు హామీ ఇచ్చారు. సర్వీస్ రోడ్స్ 25 అడుగుల వెడల్పుతో ఉంటాయని, గవర్నమెంట్ ఆసుపత్రి ఎదురు పిల్లర్ల మధ్య అడ్డుగోడ లేకుండా పూర్తిగా రాకపోకలకు అవకాశం ఉండే విధంగా కృషి చేస్తామని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర రావు తెలిపారు. ఈ సమావేశంలో గుంటూరు నగర కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ మరియు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

# గుడ్‌న్యూస్.. తగ్గిన పసిడి, వెండి ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో ఎంత తగ్గాయంటే..

అమరావతి : గత కొంతకాలం నుంచి బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ఆల్ టైం హైకి చేరుకున్నాయి.. స్వచ్ఛమైన బంగారం ధర 90 వేల మార్క్ దాటి పరుగులు తీస్తోంది. కిలో వెండి ధర లక్షా 12వేలకు చేరువైంది.. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, పరిస్థితుల ప్రకారం ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. ఒక్కోసారి ధరలు పెరిగితే, మరికొన్నిసార్లు తగ్గుతుంటాయి.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. 22 మార్చి 2025 శనివారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.82,690, 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.90,210 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,02,900 గా ఉంది. దేశీయంగా 10గ్రాముల బంగారంపై రూ.10, కిలో వెండిపై రూ.100 మేర ధర తగ్గింది.కాగా.. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..

బంగారం ధరలు..

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,690, 24 క్యారెట్ల ధర రూ.90,210 గా ఉంది.

విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,690, 24 క్యారెట్ల ధర రూ.90,210

ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.82,840, 24 క్యారెట్ల ధర రూ.90,360 గా ఉంది.

ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.82,690, 24 క్యారెట్ల ధర రూ.90,210 గా ఉంది.

చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.82,690, 24 క్యారెట్ల రేటు రూ.90,210 గా ఉంది.

బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.82,690, 24 క్యారెట్ల ధర రూ.90,210 గా ఉంది.

వెండి ధరలు..

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,11,900

విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,11,900

ఢిల్లీలో వెండి కిలో ధర రూ.102,900 లుగా ఉంది.

ముంబైలో రూ.102,900 గా ఉంది.

బెంగళూరులో రూ.102,900లుగా ఉంది.



చెన్నైలో రూ.1,11,900 లుగా ఉంది.

## ఒక్కగానొక్క కొడుకు.. మంచిగా చదువుకుని చేదోడుగా ఉంటాడనుకుంటే..



హైదరాబాద్: ఇంజనీరింగ్ చదువుతున్నాడు.. ఇక చేతికొస్తాడులే.. అనుకున్నారు తల్లిదండ్రులు.. కానీ, అతను ఆన్‌లైన్ గేమ్స్ కు అలవాడుపడ్డాడు.. అది కాస్త వ్యసనంగా మారింది.. డబ్బులు వస్తాయని ఆశపడ్డాడు.. కానీ అప్పుల పాలయ్యాడు.. చివరకు అప్పులు పెరిగిపోయాయి.. ఒత్తిడి ఎక్కువైంది.. ఇక చెల్లించలేనన్న బాధ వెంటాడింది.. చివరకు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు.. దీంతో.. తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాద ఘటన తెలంగాణలోని కరీంనగర్‌లో చోటుచేసుకుంది.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ నిఖిల్ రావు హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన నిఖిల్ రావు అప్పులు చేశాడు. గతంలో ఆన్లైన్ గేమ్స్ ఆడి పెద్ద మొత్తంలో నష్టపోతే తల్లిదండ్రులు ఆ అప్పును చెల్లించారు. ఇంకెప్పుడూ వాటి జోలికి వెళ్లొద్దని సూచనలు చేశారు.. దీంతో కొంత కాలం ఆన్‌లైన్ గేమ్స్ కు దూరంగా ఉన్నాడు.. ఆ తర్వాత మళ్లీ యథామామూలుగా మళ్లీ నిఖిల్ రావు గేమ్స్ ఆడటం మొదలుపెట్టాడు..డబ్బులు లేకపోవడంతో అప్పులు తీసుకుని మళ్లీ ఆన్‌లైన్ గేమస్ ఆడటం ప్రారంభించాడు. ఇలా మళ్లీ అప్పులు పెరిగాయి.. ఇటీవల హైదరాబాద్ నుండి నిఖిల్ రావు కరీంనగర్ వచ్చాడు. తిరిగి హైదరాబాదు వెళ్తానని తండ్రితో చెప్పడంతో తండ్రి తిరుపతి రావు తన కొడుకును కరీంనగర్‌లో బస్ ఎక్కించాడు. కరీంనగర్ నుండి హైదరాబాద్ బస్సు ఎక్కిన నిఖిల్ రావు ఇంద్రనగర్ వద్ద బస్సు దిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి.. తమ వ్యవసాయ బావిలో పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు..సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వివరాలు సేకరించారు.. స్థానికుల సహకారంతో డెడ్ బాడీని బయటకు తీశారు.. అనంతరం పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి వరకు తమతో ఉన్న ఒక్కగానొక్క కొడుకు విగత జీవిగా కనిపించడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.. వారి రోదనలు అందరినీ కంటతడి పెట్టించింది. తండ్రి సిరికొండ తిరుపతి రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు! తాళిని వాళ్ల ముఖంపై విసిరి.. మహిళ ఏం చేసిందంటే..?

అమరావతి : ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల ఆగడాలు రోజురోజుకు హద్దుమీరుతున్నాయి. ఈ వేధింపుల కారణంగా ఇప్పటికే చాలా మంది ఆత్మహత్యలు చేసుకోగా.. తాజాగా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బజాజ్ ఫైనస్ కంపెనీలో ఓ వివహిత ఆత్మహత్య యత్నం కలకలం రేపింది. కరోనా సమయంలో తన ఇంటిని తాకట్టు పెట్టి వెంకటలక్ష్మి అనే వివహిత 19 లక్షలు అప్పు తీసుకోని వాయిదాల పద్దతిలో కొన్ని నెలలు సక్రమంగా కడుతుండగా, కొన్ని నెలల క్రితం కొన్ని ఇబ్బందులతో నెల వాయిదాలు కట్టకపోవడంతో బ్యాంకు సిబ్బంది ఇంటికి తాళం వేశారు. దీంతో కొన్ని నెలలు సమయం తీసుకొని కొంత డబ్బులు బ్యాంకు కు జామచేస్తే, ఇంటికి వేసిన తాళం తమ చేతికి ఇచ్చారన్నారు.అయితే తిరిగి కొంత డబ్బు కట్టాల్సి ఉంటే, అవి కూడా మొత్తం కట్టినా చివరికి నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా మళ్లీ పెనాల్టీ లు ఏడు లక్షల రూపాయలు కట్టాలని చెప్పడంతో, మహిళా, భర్త ఇద్దరు కలిసి బ్యాంకు దగ్గరకు చేరుకొని బ్యాంకు సిబ్బందితో వాగ్వదానికి దిగి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రం బ్యాంకు సిబ్బంది ముఖంపై విసిరి కొట్టి, అక్కడే పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. వెంటనే పక్కన ఉన్న వారు ఆమె చేతిలో ఉన్న పురుగుమందు డబ్బు తీసుకోవడంతో అంత పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేయగా బ్యాంకు సిబ్బంది మహిళకు నో డ్యూ సర్టిఫికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ మెట్రో భారీ శుభవార్త.. ఇక ఎంజాయ్ పండగో..!



హైదరాబాద్ : మెట్రో రైలు కీలక ప్రకటన చేసింది. మార్చి 22న నుంచి ఐపీఎల్-2025 సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో.. హైదరాబాద్ మెట్రో రైలు శుభవార్త వినిపించింది. మార్చి 22 నుంచి మొదలు ఐపీఎల్ సీజన్ పూర్తయ్యేవరకు చివరి రైలు సమయాన్ని మరో గంటపాటు పెంచుతున్నట్టు యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు చివరి రైలు అర్ధరాత్రి 12 గంటల 15 నిమిషాలకు బయలుదేరి ఒంటి గంట 10 నిమిషాలకు గమ్యస్థానాలు చేరుకోనున్నట్టు ప్రకటించింది.ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం భారీ శుభవార్త వినిపించింది. మెట్రో రైలు సమయాన్ని పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగానే.. చివరి మెట్రో రైలు రాత్రి 11 గంటలకు బయలుదేరి 12 గంటలకు గమ్యాన్ని చేరుకోంటుండగా.. ఇకపై చివరి మెట్రో రైలు 12 గంటల 15 నిమిషాలకు బయలుదేరి 1:10 నిమిషాలకు గమ్యం చేరుకోనున్నట్టు మెట్రో యాజమాన్యం ప్రకటించింది. రేపటి (మార్చి 22న) నుంచి ఐపీఎల్-2025 సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో.. ఈ బంపర్ ఆఫర్ ప్రకటించింది మెట్రో యాజమాన్యం.ఐపీఎల్-2025 సీజన్ ప్రారంభమవుతున్న వేళ చివరి మెట్రో రైలు సమయాన్ని పొడిగిస్తూ కీలక ప్రకటన చేసింది యాజమాన్యం. రేపటి (మార్చి 22) నుంచి ఐపీఎల్-2025 సీజన్ ముగిసే వరకు.. చివరి మెట్రో రైళ్లు రాత్రి 12.15 గంటలకు బయల్దేరి.. 1.10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని కీలక ప్రకటన చేసింది. అందులోనూ.. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లలో మాత్రమే ప్రయాణికులకు ప్రవేశం ఉంటుందని హైదరాబాద్ మెట్రో పేర్కొంది. దీంతో.. అటు ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లు వీక్షించే క్రికెట్ అభిమానులతో పాటు ఆ మార్గాల్లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు కూడా కాస్త ఊరట లభించే అవకాశం ఉంది.క్రికెట్ అభిమానులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఐపీఎల్-2025 ప్రారంభమువుతున్న నేపథ్యంలో.. హైదరాబాద్ మెట్రో నగర ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. రేపటి (మార్చి 22వ తేదీ) నుంచి ఏపీఎస్ 2025 సీజన్ ప్రారముపుతుండగా.. మొదటి మ్యాచ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు , కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరుగనుంది. ఈ మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగనుంది. అయితే.. రెండో రోజు అంటే ఆదివారం (మార్చి 23న) రోజున 2 మ్యాచులతో అభిమానులకు డబుల్ ధమాకా ఉండబోతోంది. 23వ తేదీన హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్ జరగనుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఇక రెండో మ్యాచ్ చెన్నైలోని చిదంబరం మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరగనుంది.ఆదివారం రోజు మధ్యాహ్నం 3 గంటలకు సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ నేపథ్యంలో.. హెచ్‌సీఏ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మ్యాచ్ కోసం ఉప్పల్ స్టేడియంలోనే పోలీసులు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 450 సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా, 2700 మంది పోలీసులతో భారీ బందోబస్తుతో పాటు మహిళల భద్రత కోసం మఫ్టీలో షీ టీమ్స్‌ని కూడా ఏర్పాటు చేశారు. మైదానంలో క్రికెట్ అభిమానులు అత్యుత్సాహం చూపిస్తే మాత్రం వారికి దబిడి దిబిడే అని హెచ్చరిస్తున్నారు పోలీసులు.

## భద్రాద్రి రామయ్య కల్యాణం కోసం.. చీరాల నుంచి 10 టన్నుల గోటి తలంబ్రాలు

అమరావతి :సంస్కృతి, సంప్రదాయాలకు భారతదేశం పెట్టింది పేరు. పండుగలు మొదలు కల్యాణ మహోత్సవాల వరకు ఒక్కొక వేడుకకు ఒక్కో విశిష్టత ఉంటుంది. వేడుకలు ఏవైనా భావితరాలకు స్ఫూర్తి నిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ కోవకు చెందిందే సీతారాముల వారి కల్యాణ మహోత్సవం. కల్యాణంలో అతి పవిత్రంగా భవించేవి వాటిలో తలంబ్రాలు ముందు వరుసలో ఉంటాయి. పసుపు, ముత్యాలు, ధాన్యం మేళవింపుతో వివాహ వేడుకలకు తలంబ్రాలను వినియెగిస్తారు. వీటిలో వినియెగించే ఒక్కొక వస్తువుకు ఓ ప్రత్యేకత ఉంది. పసుపు సకల శుభలకు దీపికగా ముత్యాలు ముత్యం వంటి కల్మషం లేని మనస్సుతో వధూవరులు ఆనందంగా జీవించాలని ప్రతీకగా ఇక ధాన్యం ధన దాన్యాలతో సరితూగలని భావనగా ఉంటాయి. మరి ఇలాంటి విశిష్ట కలిగిన తలంబ్రాలు, అందులో జగత్ కల్యాణంగా భావించే భద్రాచలం సీతారాముల వారి కల్యాణ మహోత్సవంలో దేవతమూర్తుల శిరస్సు నుంచి జాలువారే తలంబ్రాలకు ఎంతో పవిత్రత ఉంటుంది. అటువంటి జానకిరామునికి నిర్వహించే కల్యాణోత్సవంలో యాంత్రికంగా ఒలిచినవి కాకుండా కేవలం మహిళలు గోటితో మాత్రమే ఒడ్లను వలుస్తారు. ఇలా వలిచిన గోటి తలంబ్రాలనే భద్రాద్రిలో రాములోరి కల్యాణానికి ఉపయోగిస్తారు.



దశాబ్దాల సాంప్రదాయం

రాములోరి కల్యాణంలో వినియెగించే గోటి తలంబ్రాలు సిద్ధం చేసే అరుదైన అవకాశం బాపట్ల జిల్లా చీరాల వాసులకి దక్కింది. కల్యాణ వేడుకలలో తలంబ్రాలను తాకితేనే ఎంతో పుణ్యమాని భావిస్తారు భక్తులు. అటువంటిది సాక్ష్యాత్తూ ఆ జానకిరాముని కల్యాణానికి వినియెగించే కోటి గోటి తాలంబ్రాలను సిద్ధం చేసే భాగ్యం దక్కితే ఆ అనుభూతే వేరు కదా. అటువంటి మహత్కర కార్యానికి శ్రీకారం చూట్టారు బాపట్ల జిల్లా చీరాల ప్రాంత వాసులు. భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే సీతారాములవారి కల్యాణానికి గడచిన 11 సంవత్సరాలుగా చీరాల ప్రాంతానికి చెందిన శ్రీ రఘురామా భక్త సేవ సమితి ఆధ్వర్యంలో కోటి గోటి తలంబ్రాలు ఒలిచి కల్యాణ వేడుకులకు తరలిస్తూ స్వామివారి సేవలో భక్తులు పునీతులవుతున్నారు. ప్రతి ఏటా విజయ దశమి నాటి మొదలుకొన్ని ఉగాది వరకు అంటే ఆరు నెలలు పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో చీరాల పరిసర ప్రాంతాలలోని సీతారామ భక్తులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. శ్రీరామనామ జపం చేస్తూ 10 టన్నుల తలంబ్రాలను గోటితో ఒలిచి రాములోరి కల్యాణ వేడుకులకు తరలించడం ఆనవాయితీగా వస్తుంది. ప్రస్తుతం ఈ కోటి గోటి తలంబ్రాలను ఎంతో భక్తిశ్రద్దలతో నియమ నిష్ఠలతో వలుస్తూ సీతారాములోరి సేవలో పరవశిస్తున్నారు. ఇంతటి మహత్కార్యంలో తమను భాగస్వాములు చేయడం ఆనందంగా ఉందంటున్నారు భక్తులు. అంతేనా సాక్ష్యాత్తూ సీతారాముల వారి కల్యాణం మహోత్సవానికి అన్ని తామై స్వయంగా వివాహ వేడుకలను నిర్వహిస్తున్న భావన తమలో కలుగుతుందంటున్నారు నిర్వాహకులు పొత్తూరి బాలకేశవులు.

# ఒకే దగ్గరికి చేరిన రేవంత్- కేటీఆర్.. వాట్ నెక్స్ట్?



హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలను తీవ్ర ఆందోళనలోకి నెడుతోన్న అంశం- డీలిమిటేషన్. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాల ంటూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఆశించిన స్థాయిలో సీట్ల సంఖ్య పెరగవని ఇక్కడి ప్రభుత్వాలు భావిస్తోన్నాయి.ఈ పరిస్థితుల మధ్య- కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా సరికొత్త ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు స్టాలిన్. దక్షిణాది రాష్ట్రాలన్ని ంటినీ ఏకతాటిపైకి తీసుకుని రావడానికి కృషి చేస్తోన్నారు. ఇందులో భాగంగా దక్షిణాదిన బీజేపీ- మిత్రపక్షాలేతర ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల అధినాయకులతో నేడు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఫెయిర్ డీలిమిటేషన్ అనేది ఈ భేటీ ప్రధాన డిమాండ్.జాతీయ స్థాయిలో ప్రతిపక్షంగా ఉంటోన్నందున కాంగ్రెస్ దీనికి మద్దతు ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భేటీకి హాజరు అయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ- ఎన్డీఏ కూటమితో వ్యతిరేకం కావడం వల్ల అటు భారత్ రాష్ట్ర సమితి ప్రాతినిధ్యం కూడా ఈ సమావేశంలో కనిపించింది.మాజీ మంత్రి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇందులో పాల్గొన్నారు. రేవంత్ రెడ్డితో కలిసి వేదికను పంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రం వరకు రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ- డీలిమిటేషన్ అనేది జాతీయ స్థాయి అంశం కావడం, బీజేపీ విధానాలను ఈ రెండు పార్టీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న నేపథ్యంలో వారిద్దరూ ఈ భేటీకి హాజరయ్యారు.కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు - పినరయి విజయన్, భగవంత్ మాన్, బిజు జనతాదళ్ ప్రతిని ధులు ఇందులో పాల్గొన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధినేత డీకే శివకుమార్.. కొద్దిసేపటి కిందటే చెన్నైకి చేరుకున్నారు కూబా. డీఎంకే సమావేశానికి హాజరు కానున్నారు. చెన్నై విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది.ఈ భేటీకి తాను హాజరు కావట్లేదని, పార్టీ తరఫున డీకే హాజరవుతారంటూ ఇదివరకే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఈ మేరకు స్టాలిన్‌కు లేఖ రాశారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు కూడా ఆహ్వానం అందినప్పటికీ- ఆ పార్టీ ప్రాతినిధ్యం ఉండట్లేదు. ఇందులో పాల్గొనదల చుకోలేదు.దక్షిణాదిన తెలుగుదేశం, జనసేన మినహా అన్ని పార్టీలు కూడా డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా గళమెత్తుతున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తటస్థ వైఖరిని ఇక్కడ కూడా కొనసాగిస్తోంది. ఫలితంగా- ఈ సమావేశానికి ఏపీ నుంచి ప్రధాన పార్టీల ప్రాతినిధ్యం దాదాపుగా లేనట్టే.

## ఏపీ వ్యాప్తంగా ఆపరేషన్ గరుడ పేరుతో దాడులు




అమరావతి : మందుల దుకాణాల పేరుతో పెద్ద దందా నడుస్తోంది. దీంతో ఆపరేషన్ గరుడ పేరుతో ఏపీ వ్యాప్తంగా మెడికల్ షాపులు, ఏజెన్సీలపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈగల్ టీమ్స్, పోలీస్, మెడికల్ అధికారులు కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ గరుడ కోసం మొత్తం 100 టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఈ తనిఖీల్లో నిషేధిత మందుల సరఫరా, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. డ్రగ్స్ తరహాలో వాడేందుకు కొన్ని రకాల టాబ్లెట్లు, ఇంజెక్షన్లను మెడికల్ షాపుల నుంచి యువత కొనుగోలు చేస్తున్నట్లు సమాచారంతో అధికారులు మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మెడికల్ షాపుల్లో మందుల నాణ్యత, రికార్డులను అధికారులు పరిశీలించారు.

ప్రిస్కిప్షన్ లేకుండా మందుల విక్రయం

ఈ తనిఖీల్లో కీలక విషయాలు గుర్తించారు అధికారులు. చాలా చోట్లు ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తేలింది. ఇకపై ఇలా అనుమతుల్లేకుండా విక్రయిస్తే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రిస్కిప్షన్ మీద అమ్మాల్సిన మందులు మాత్రమే మందుల షాపులో విక్రయించాలని సూచించారు. శాంపిల్ డ్రగ్స్ అమ్మినా చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. చీ=ఆ డ్రగ్స్‌ను డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా ఎట్టిపరిస్థితుల్లో అమ్మకూడదని, కొన్నిచోట్ల అనధికారికంగా న్యూ డ్రగ్స్‌ని ప్రిస్కిప్షన్ లేకుండా అమ్ముతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చాయని డ్రగ్స్ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు చెప్పారు. షాపులోని మెడిసిన్‌కు సంబంధించిన డేటా మెయింటైన్ చేయట్లేదని అధికారులు తెలిపారు.

కొన్ని మెడికల్ షాపులకు అనుమతులు లేనట్లు గుర్తింపు

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మెడికల్ షాపులకు అనుమతులు లేనట్లు గుర్తించారు. కొన్ని చోట్ల లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మాత్రం మరొకరిది అన్నట్టు ఉంది పరిస్థితి. మెడికల్ షాప్ లో బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు లేక, చాలా వరకు సంబంధిత కోర్సు చేసిన వారి సర్టిఫికెట్లు అద్దెకు తెచ్చుకుని లైసెన్స్ తీసుకొని మరి మెడికల్ వ్యాపారం చేస్తున్నారు. వివిధ మందుల కంపెనీల ప్రతినిధులు ఇచ్చే తాయిలాలకు కక్కుర్తి పడి.. రోగులకు అవసరం లేకున్నా ఆయా మందులను అంటగడుగుతున్నారు. ఒకటి రెండు రకాల మందులతో నయం అయ్యే రోగానికి కూడా ఐదారు రకాల కంపెనీల మందులను రాసి కమీషన్ల రూపంలో వైద్యులు తమ జేబులు నింపుకుంటూ ప్రజలను ముంచుతున్నారు. దీంతో పలు షాపులకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇలా మెడికల్ మాఫియాపై కూడా అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు.

## గుడ్ న్యూస్.. పట్టాలెక్కబోతున్న తొలి హైడ్రోజన్ రైలు

